

బైకును ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

కోస్గి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పేట జిల్లా కోస్గి మండలం చంద్రవంచ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై బాల్‌రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రవంచ గ్రామానికి చెందిన వడ్డె శ్రీనివాస్(40) కోస్గి నుంచి గ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గ్రామ శివారులోని పెట్రోల్‌పంపు సమీపంలో వెనక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై మృతుడి భార్య పుష్పలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో రాత్రి వేళ మంట కాపుకుంటున్న గ్రామస్థులు


వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో చలికి టీ తాగడానికి వచ్చిన వృద్ధులు


నారాయణపేట జిల్లా కేంద్రంలో కమ్ముకున్న పొగమంచు


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో తెల్లవారుజామున చలిలోనే కూరగాయలను మార్కెట్‌కు తీసుకెళ్తున్న మహిళలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చలి తీవ్రత పెరిగింది. రోజు రోజుకు పడిపోతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను వణికిస్తున్నాయి. సాయంత్రం ఆరు కాగానే చలి గాలులు వీస్తున్నాయి. తెల్లవారుజామున కమ్ముకుంటున్న పొగ మంచుతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు, వృద్ధులు చలికి అవస్థలు పడుతుండగా, పొలాల వద్దకు కావలి వెళ్తున్న రైతుల పరిస్థితి చెప్పనలవికాకున్నది. మునిసిపల్ కార్మికులు, పేపర్ బాయ్‌లు, పాల వ్యాపారం చేసే వారిదీ అదే దుస్థితి. చలి నుంచి రక్షణ పొందేందుకు మంటలు కాచుకోవడంతో పాటు పాటు స్వెటర్లు, మఫ్లర్లు ధరిస్తున్నారు.


నారాయణపేటలో చిన్నారికి కట్టిన మఫ్లర్


నారాయణపేటలో చలిమంట కాచుకుంటున్న యువకులు


మహబూబ్‌నగర్‌లోని క్లాక్‌టవర్ వద్ద తలకు మఫ్లర్ కట్టుకొని రోడ్డు ఊడుస్తున్న కార్మికులు

మరిన్ని చిత్రాలు 6లో..


మహబూబ్ నగర్‌లో స్కార్ఫ్‌తో మహిళ

గజగజ

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిన చలి
- పడిపోతున్న పగటి ఉష్ణోగ్రతలు
- 18 డిగ్రీలకు చేరిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఉదయం ఎనిమిది దాటితేగాని బయటికి రాలేని పరిస్థితి
- పొలం వద్దకు వెళ్లే రైతులు, మునిసిపల్ కార్మికుల అవస్థలు
- పెరిగిన స్వెటర్లు, మంకీ క్యాప్‌ల వినియోగం

మహబూబ్‌నగర్/నారాయణపేట/వనపర్తి అర్బన్/అచ్చంపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో చలి వణికిస్తోంది. పాలమూరులో నాలుగు రోజుల్లోనే జిల్లాలో 2.6 డిగ్రీల ఉష్ణోగ్రత పడిపోయింది. డిసెంబరులో ఉష్ణోగ్రతలు మరింత పడిపోయే అవకాశాలు ఉన్నాయి. తెల్లవారుజామున కమ్ముకుంటున్న పొగ మంచుతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళ ద్విచక్ర వాహనాలపై, వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లేవారు చలికి వణుకుతున్నారు. చలిని తట్టుకునేందుకు స్వెటర్, మంకీక్యాప్‌లు ధరిస్తున్నారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు స్వెటర్‌తోపాటు చెవులకు టవల్‌తో చుట్టుకుంటున్నారు.

పొలం కాడికి పోలేకపోతున్నాం

రెండు రోజుల నుంచి చలి పెరిగింది. పొలంలో పల్లీలు ఏసినం. నీళ్ల పెట్టనికి పోవాలంటే చలికి భయమవుతుంది. ఇంకా సలి ఎక్కువ అయితదని అంటున్నారు. ఉదయం పూట మూడు పేసుల కరంటు ఉండేటట్లు సూస్తె పగటి పూటనే పొలాలకు నీళ్ల పెట్టుకుంటం.

\- చంద్య, రైతు, అచ్చంపేట


● నారాయణపేట జిల్లాలో కూడా కనిష్ఠ ఉష్ణోగ్రతలు 18 డిగ్రీలకు పడిపోయాయి. ఉదయం ఎనిమిది గంటలు అయితేగానే బయటికి రాని పరిస్థితి నెలకొంది. చలి నుంచి రక్షణ పొందేందుకు మంటలు కాచుకుంటున్నారు.

నల్లమలలో రైతుల ఇబ్బందులు

నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమలలో వాతావరణ మార్పుల వల్ల మూడు రోజులుగా చలి అధికమైంది. జిల్లాలోనే అత్యధికంగా అటవీ ప్రాంతం కలిగిన అచ్చంపేట నియోజకవర్గంలో ప్రజలు చలికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళ పొలాల వద్దకు వెళ్లే రైతులు నానా పాట్లు పడుతున్నారు. చిన్నపిల్లలు, ముసలివారు గడపదాటని పరిస్థితి నెలకొంది.

మునిసిపల్ కార్మికుల అవస్థలు

వనపర్తి జిల్లాలో 18.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రైతులు, వివిధ పనులు, ఉద్యోగాల నిమిత్తం తెల్లవారుజామున బయటికి వెళ్లేవారు అల్లాడుతున్నారు. ప్రధానంగా మునిసిపల్ కార్మికులు, పేపర్ బాయ్‌లు, పాల వ్యాపారం చేసే రైతులు స్వెటర్లు, మంకీ క్యాపులు ధరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నిద్రించే రైతులు చలి మంటలు కాచుకుంటున్నారు. చలి పెరగడంతో దగ్గు, జలుబు వంటి రుగ్మతలతో ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.


ఖిల్లాఘణపూర్ మండల కేంద్రంలో చలికి టీ తాగుతున్న వృద్ధుడు

ఉమ్మడి జిల్లాలో ఉష్ణోగ్రతలు ఇలా..

జిల్లా	కనిష్ఠం	గరిష్ఠం
మహబూబ్‌నగర్	18.9	30
నారాయణపేట	18	30
నాగర్‌కర్నూల్	17	30
గద్వాల	15.9	33.3
వనపర్తి	18.9	30


వనపర్తిలో మంచుకు లైట్లు వేసుకొని వస్తున్న వాహనదారులు



సరదాగా.. సంతోషంగా
పాఠశాల, కళాశాల విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రలు
పీఎం శ్రీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం, 'తెలంగాణ దర్శిని' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం
7

రైలులో ప్రయాణిస్తూ
గుండె పోటుతో వ్యక్తి మృతి
7

పరిహారం పరిహాసం
నాలుగు నెలల క్రితమే ఇచ్చినట్లు రైతులతో సంతకాలు
ఇప్పటికీ అందని చెక్కులు
తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన
7

ప్రజా సంక్షేమానికి నిరంతర కృషి

- ఓర్వలేకే విమర్శిస్తున్న ప్రతిపక్షాలు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మమబూబ్‌నగర్ న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నదని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి ట్యాంక్‌బండ్ సమీపంలోని శిల్పారామంలో సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య పుంజల బృందం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన పది నెలల్లోనే ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశ పెట్టిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని అన్నారు. ఓర్వలేని ప్రతిపక్షాలు అనాలోచిత ఆరోపణలు చేస్తూ, ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్రలు పన్నుతున్నాయని అన్నారు. వాటిని ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన తొలి 48 గంటల్లోనే ఆరు గ్యారెంటీల్లో రెండింటిని అమలు పర్చిందన్నారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద పేదలకు అందించే వైద్య సేవల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందని, రైతు రుణమాఫీ అమలు చేసిందని, ఆధునిక పరిశ్రమలు ఏర్పాటు చేసిందని, మెగా డీఎస్సీ నిర్వహించిందని చెప్పారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించిందని తెలిపారు. కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మోహన్‌రావు, శివేంద్ర ప్రతాప్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీఆర్‌వో, కలెక్టరేట్ ఏవో శంకర్, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



బతుకమ్మలతో ప్రదర్శన ఇస్తున్న మహిళా కళాకారులు


ప్రభుత్వ పథకాలపై ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


బాలస్వామి(ఫైల్)

బల్మూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూరు మండల పరిధిలో చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి బల్మూరు ఎస్‌ఐ అనురాధ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అనంతవరం గ్రామానికి చెందిన కొండట్ల బాలస్వామి(55) అనే వ్యక్తికి మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నది. కూతురి వివాహం కోసం రెండున్నర ఎకరాలు అమ్మాడు. మళ్లీ మనుమరాలి వివాహం, కుటుంబ అవసరాల కోసం సుమారు రూ. 15 లక్షల అప్పు చేశాడు. ఉన్న అర ఎకరం భూమిని కూడా అప్పుల కింద తాకట్టు పెట్టాడు. ఈ విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరిగాయి. దీంతో మనస్తాపం చెందిన ఆయన తన వ్యవసాయ భూమిలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య వెంకటమ్మ ఫిర్యాదులో కొంత అప్పు ఉన్నదని చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాదకద్రవ్యాలు లేని జిల్లాగా మార్చాలి

- నారాయణపేట
- కలెక్టర్ సిక్తా పట్నాయక్


మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేటను మాదక ద్రవ్యాలు లేని జిల్లాగా మార్చాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో యాంటీ నార్కోటిక్‌పై ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ యోగేష్ గౌతమ్‌తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో గంజాయి సాగు జరుగకుండా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్, డిగ్రీ కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని చెప్పారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తరచూ తనిఖీలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఇప్పటివరకు మూడు మాదకద్రవ్యాల కేసులు నమోదయ్యాయని డీఎస్పీ లింగయ్య తెలిపారు. మద్దూరులో ఒకటి, రెండు ఒరిస్సా కార్మికులపై నమోదయ్యాని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్‌షాలం, ట్రైనీ కలెక్టర్ గరీమా నరుల, ఏవో జయసుధ పాల్గొన్నారు.

నేడు అంజనా గార్డెన్స్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు

జిల్లా కేంద్రంలోని అంజనాగార్డెన్స్‌లో ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు బుధవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై సంగీత నాటక అకాడమీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపిపారు. ఈ విషయమై కలెక్టర్‌లో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

గజగజ

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెరిగిన చలి


మహబూబ్‌నగర్ బస్టాండ్ వద్ద చలికి టీ తాగుతున్న పట్టణవాసులు


ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో తలకు తువ్వాల కట్టుకొని వెళ్తున్న మహిళ


మహబూబ్‌నగర్ అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద చలిమంట కాచుకుంటున్న పట్టణవాసులు


మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ వద్ద చలిలోనే పడుకున్న ప్రయాణికులు


ఖిల్లాఘణపురం తండా సమీపంలో మంచులో చిక్కుకున్న సూరీడు


వనపర్తి జిల్లా పామిరెడ్డిపల్లి శివారులో కమ్ముకున్న పొగమంచు


బైక్‌పై మార్కెట్‌కు కూరగాయలు తీసుకెళ్తున్న వ్యక్తి


మహబూబ్‌నగర్‌లోని బోయపల్లిలో పేపర్ వేస్తున్న బాయ్


ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో దుప్పటి కప్పుకొని వెళ్తున్న వ్యక్తి

'ఉపాధి' పనులపై అధికారుల అసహనం

సామాజిక తనిఖీ సభలో పలువురికి షోకాజ్ నోటీసులు


సభలో మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్‌డీపీ నాగేంద్రం

అమరచింత, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభలో అధికారులు క్షేత్రస్థాయి పనులపై అసహనం వ్యక్తం చేశారు. మంగళవారం వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని డీఎంఆర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో జరిగిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజా వేదిక సభలో అడిషనల్ డీఆర్‌డీఏ నాగేంద్రం, ఏపీడీ సుల్తాన్, ఏపీవో రహీం, అంబుడ్స్‌మెన్ సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 2023 నుంచి మార్చి 2024 వరకు జాతీయ ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ ద్వారా జరిగిన 282 పనుల రూ.2,77,04,498 పనులకు వారం రోజుల నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదిక సభలో గ్రామాల వారీగా తనిఖీ రిపోర్టు పరిశీలించగా చాలా గ్రామాల్లో క్షేత్రస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు అసహనం వ్యక్తం చేశారు. కొన్ని గ్రామాల్లో రిజిస్టర్లు సక్రమంగా రాయకపోవడం, పనులు జరగకుండా బిల్లులను తీసుకోవడం, గుంతలు ఎక్కువ చూపి మొక్కలు తక్కువగా నాటడం, నాటిన మొక్కల వద్ద సామాజిక తనిఖీలలో అక్కడ మొక్కలు లేకపోవడం, పంచాయతీ సిబ్బందికి ఈజీఎస్ బిల్లులు ఇవ్వడం, కూలీల సంతకాలు లేకుండానే బిల్లులు ఇవ్వడం, ఓ గ్రామంలో తోట నిర్వహణపై బిల్లులు తీసుకోగా సామాజిక తనిఖీలో అక్కడ తోట లేకపోవడం, మస్టర్ల నిర్వహణ లేకపోవడం ఇలా అనేక తప్పులు గ్రామాల వారీగా సభలో సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించగా అక్కడున్న అధికారులు అవాక్కయ్యారు. అడిషనల్ డీఆర్‌డీఏ మాట్లాడుతూ.. అధికారులు బాధ్యతారహితంగా ఉంటే చర్యలు తప్పవని అన్నారు. ఆయా గ్రామాల్లో జరిగిన తప్పులను షోకాజ్ నోటీసులకు ఆదేశించామని, ఇలాంటి తప్పులు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో బాలయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో నరసింహయ్య, సీఆర్‌పీ ముత్తయ్య, ఈజీఎస్ అధికారులు రఘు, రఘుపతి రెడ్డి తదితరులు ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా.. తప్పిన ప్రాణాపాయం

మక్తల్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ బోల్తాపడి ప్రాణాపాయం తప్పిన సంఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి గేటు శివారులో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూరు మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన రైతు లక్ష్మణ్ ట్రాక్టర్‌లో పత్తిలోడ్ తీసుకొని రాయచూర్ మార్కెట్‌కు వెళ్తుండగా మక్తల్ మండలం ఉప్పర్‌పల్లి గేటు వద్ద స్టీరింగ్ తిరగకపోవడంతో బోల్తా పడింది. ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

భక్తిశ్రద్ధలతో గురుగాయత్రి సామూహిక హోమం

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట సుభాష్‌రోడ్‌లో గల సద్గురు అవధూత నర్సింహస్వామి 133వ ఆరాధనోత్సవా లు మంగళవారం మఠం కమిటీ సభ్యుల ఆధ్వ ర్యంలో వేద పండితుల వేదమంత్రోచ్ఛరణల మధ్య గురు గాయత్రి సామూహిక హోమం ఘ నంగా నిర్వహించారు. నర్సింహస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణం, స్వామివారికి కాగడ హారతి, రుద్రాభిషేకం, మహా మంగళహార తి తదితర ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు.

నేడు విధుల్లో చేరనున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారిగా ఎ.ప్రవీణ్‌కుమార్ బుధవారం విధుల్లో చేరనున్నారు. మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాల ఇన్‌చార్జి డీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఎ.రవీందర్ ఈనెల ఓ టీచర్ నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 13 రోజులుగా మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల జిల్లాలకు జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టు ఖాళీగా ఉంది. దీంతో విద్యాశాఖ కార్యాలయంలో చాలా ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా వికారాబాద్ జిల్లా విద్యాశాఖ ఏడీ ఎ.ప్రవీణ్‌కుమార్‌ను ఇన్‌చార్జి డీఈవోగా మహబూబ్‌నగర్, గద్వాల జిల్లాలకు నియమిస్తూ పాఠశాల విద్యాశాఖ ఈనెల 12న ఉత్తర్వులు ఇచ్చింది. కాగా ఆయన ఇక్కడ చేరేందుకు ఇష్టపడటంలేదని తెలిసింది. గత శనివారం వరకు ఆయన సెలవుపై ఉన్నారు. రెండు జిల్లాలకు డీఈవో బాధ్యతలు కాకుండా ఏదో ఒక జిల్లా కు బాధ్యతలు ఇస్తే విధుల్లో చేరుతానని పాఠశాల విద్యాశాఖ అధికారులను కలిసి వివరించినట్లు సమాచారం. అయితే మంగళవారం మరోమారు పాఠశాల విద్యాశాఖ కలిసినట్లు తెలిసింది. వారి హామీతో బుధవారం మహబూబ్‌నగర్ డీఈవోగా బాధ్యతలు తీసుకోనున్నట్లు తెలిసింది. గద్వాల జిల్లాకు ఆయన బాధ్యతలు తీసుకుంటారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది. దీనిపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరక్టర్ లింగయ్యను 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ద్వారా వివరణ కోరగా రెండు జిల్లాలకు ఇన్‌చార్జి డీఈవోగా ఎ.ప్రవీణ్‌కుమార్ బుధవారం బాధ్యతలు తీసుకుంటారని తెలిపారు. ఆ తర్వాత ఒక జిల్లాకు ప్రవీణ్‌కుమార్‌ను కొనసాగించి, ఇంకో జిల్లాకు మరొకరిని తర్వలోనే నియమిస్తామని తెలిపారు. డీఈవోకు పలు సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో గతంలో పలువురు ఉపాధ్యాయులకు అక్రమ డిప్యుటేషన్ ఇచ్చారు. స్పౌజ్ పాయింట్ల విషయంలో ఉపాధ్యాయుల తప్పిదాలు, ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ లేకపోవడం, ఇష్టం వచ్చినట్లు ఫీజు వసూలు చేయడం, గుర్తింపు లేని ప్రైవేట్ పాఠశాలలు ఇలా ఎన్నో సమస్యలు ఎదురుకానున్నాయి.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- నిందితుల నుంచి ఆరున్నర తులాల బంగారం స్వాధీనం
- నేరాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు : డీఎస్పీ లింగయ్య


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ

మద్దూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మద్దూర్‌లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి గురైన ఆరున్నర తులాల బంగారాన్ని దొంగల నుంచి స్వాధీనపర్చుకున్నారు. మంగళవారం మద్దూర్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ లింగయ్య చోరీ కేసు వివరాలను వెల్లడించారు. మద్దూర్ పట్టణంలో అద్దె ఇంట్లో నివాసముంటున్న పోతుల లత దంపతులు గతనెల 21న ఇంటికి తాళం వేసి రోజువారి పనిలో భాగంగా బయటికి వెళ్లారు. పని ముగించుకొని మధ్యాహ్నం ఇంటికి రాగా ఇల్లు తెరిచి ఉండడాన్ని గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో దాచిన ఆరున్నర తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సాంకేతిక ఆధారాల ప్రకారం కేసులో అనుమానితులుగా ఉన్న జోగులాంబగద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన బోయ నర్సిములు, అదే గ్రామానికి చెందిన తలారి నర్సిములును సోమవారం సాయంత్రం అదుపులోకి తీసుకొని వారి నుంచి చోరీకి గురైన ఆరున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనపర్చుకోవడంతో పాటు, నిందితులు వాడిన మూడు సెల్‌ఫోన్లు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనపర్చుకొని మద్దూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అలాగే నారాయణపేట్, ధన్వాడ పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ నేరాలకు పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఏ-1గా ఉన్న బోయ నర్సిములు కొత్తకోట పీఎస్ పరిధిలో పీడీ యాక్టు కింద ఓ సంవత్సరం జైలుకు వెళ్లాడని, దీంతో పాటు మల్దకల్, గట్టు, అయిజ, అడ్డాకుల, పాన్‌గల్, దేవరకద్ర పోలీస్‌స్టేషన్లలో 20కి పైగా కేసులు ఉన్నాయని డీఎస్పీ వివరాంచారు. కేసును ఛేదించిన కోస్గి సీఐ దస్రునాయక్, మద్దూర్ ఎస్సై రాంలాల్‌ను డీఎస్పీ అభినందించారు. నిందితులను పట్టుకున్న హెడ్‌కానిస్టేబుల్ వాసురాంనాయక్, పీసీలు భీమప్ప, పుల్నానాయక్‌లను డీఎస్పీ అభినందించడంతో పాటు, వారికి రివార్డులు అందించారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి సునీత

వనపర్తి క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి ఎం.ఆర్ సునీత అన్నారు. మంగళశారం జిల్లా కోర్టు ఆవరణలో పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని, జూనియర్ సివిల్ న్యాయాధికారి రవికుమార్, మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి శ్రీలత, డీఎస్పీ వెంకటేశ్వరావు, స్పెషల్ పీపీ శ్రీనివాసాచారి, వెంకటరమణ, శ్రీదేవి, రఘు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

రాజాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ రవి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని మల్లేపల్లి గ్రామ పంచాయతీ సోమ్లాతండాకు చెందిన పాత్లావత్ హీర్యా (49) జాతీయ రహదారి మీదుగా నడుస్తూ వెళ్తుండగా, జడ్చర్ల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం

- పట్టుబడినా తీరు మార్చుకోని అక్రమార్కులు
- బియ్యం సేకరణకు గ్రామాల్లో ప్రత్యేక బృందాలు
- రీసైక్లింగ్ చేసి ప్రత్యేక బ్రాండ్ పేరుతో వ్యాపారం
- క్వింటాలు వెయ్యి రూపాయలకు కొని రూ. 4,500 విక్రయం


అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యం వాహనాన్ని పట్టుకున్న పోలీసులు (ఫైల్)

అయిజటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల కోసం ప్రతీ నెల ఒక వ్యక్తికి నాలుగు కిలోల చొప్పున రేషన్ బియ్యాన్ని ఉచితంగా అందిస్తోంది. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉన్నప్పటికీ రేషన్ కార్డును పొందిన కొందరు స్వార్థపరుల కారణంగా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతుందనే విమర్శలు వస్తున్నాయి. ఫ్రీగా వస్తున్నాయి కాబట్టి కిలో పది రూపాయలు చొప్పున విక్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావించిన అక్రమార్కులు గ్రామాల్లో గుట్టుచప్పుడు కాకుండా రేషన్ బియ్యం సేకరించేందుకు ప్రత్యేకంగా కూలీలను ఏర్పాటు చేసుకుని దందా కొనసాగిస్తున్నారు. ఈ బియ్యాన్ని నడిగడ్డలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న అయిజ, గట్టు, ధరూరు, కేటీదొడ్డి మండలాల మీదుగా కర్ణాటకలోని రాయచూరుకు తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అక్కడ వారికి అనుకూలంగా ఉన్న మిల్లుల్లో రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి సన్నరకం బియ్యంగా మార్చి వాటినే వివిధ రకాల బ్రాండ్ల పేర్లతో సుమారు రూ. 4 వేల నుంచి రూ. 4500 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది.

వివిధ ప్రాంతాలకు తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యం

2022 జనవరిలో సుమారు 271 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. అదేవిధంగా 2024 ఫిబ్రవరిలో 37 క్వింటాళ్లు, మార్చి, ఏప్రిల్ నెలల్లో 144.5 క్వింటాళ్లు, మే నెలలో 89 క్వింటాళ్లు, నవంబరులో 86.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు.

పటిష్ఠ నిఘా ఉంచాం

అక్రమార్కులు గ్రామాలలో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసే వ్యవహారంపై పటిష్ఠ నిఘా ఉంచాం. ఎస్పీ ఆదేశాలతో కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి తనఖీలు చేస్తున్నాం. ఇప్పటికే ఈ సంవత్సరం 20కి పైగానే కేసులు కూడా నమోదు చేశాం. ప్రజలు ఇటు వంటి సంఘటనలపై మాకు సమాచారం ఇవ్వాలి.

- టాటాబాబు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శాంతినగర్, గద్వాల

ఇథనాల్ కంపెనీ పనులు నిలిపివేయాలి


కలెక్టరేట్ ముందు నిరసన తెలుపుతున్న ఆయా గ్రామాల ప్రజలు

గద్వాల న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడ గ్రామ శివారులో 29 ఎకరాల్లో గాయత్రి ఇథనాల్ కంపెనీ వారు చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయాలని మంగళవారం కలెక్టరేట్ ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ ఇథనాల్ కంపెనీ వల్ల చుట్ట పక్కల ఉన్న చిన్న ధన్వాడ, నసనూరు, మాన్‌దొడ్డి, వేణి సోంపురం, నౌరోజీక్యాంపు, కేశవరం, చిన్నతాండ్రపాడు గ్రామాలకు జల, వాయు కాలుష్యం వల్ల పంట భూములు బీడు భూములుగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ కంపెనీ నుంచి విడుదలయ్యే కలుషితమైన నీటి వల్ల రోగాలు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇథనాల్ పరిశ్రమ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రపోజల్ పెట్టకుండానే కేం ద్రం అనుమతి ఇస్తుందా? అన్నారు. వెంటనే ఈ పరిశ్రమను నిలిపివేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రైతులు జయరామ్‌రెడ్డి, నారాయణ, నరసింహులు, తిమ్మ ప్ప, శేషిరెడ్డి, జేమ్స్, దిలీప్‌రెడ్డి, వీరభద్రయ్య, సత్యనారాయణ, రాజశేఖర్ ఉన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి


లక్ష్మయ్య (ఫైల్)

గోపాల్‌పేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చింతకాయలు తెంచేందుకు చెట్టుపైకి ఎక్కగా, ప్రమాదవశాత్తు కింద పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన కోరమోని లక్ష్మయ్య (56), భార్య కోరమోని ఎల్లమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. పెద్దకుమారుడు, కూతురికి వివాహం కాగా, చిన్న కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. మండల కేంద్రంలో లక్ష్మయ్య ఎల్లమ్మ ఇద్దరు కలిసి మామిడి, చింత చెట్లను గుత్తకు తీసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. లక్ష్మయ్య మంగళవారం మధ్యాహ్నం తన ఇంటి పక్కన ఉన్న చింతచెట్టు ఎక్కి చింత కాయలు తెంచుతుండగా కాలుజారి కింద పడ్డాడు. సాయంత్రం కొందరు యువకులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఆయనను మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు లక్ష్మయ్యను పరిక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఎస్ఐ నరేష్ కుమర్‌ను వివరణ కోరగా తనకు ఫిర్యాదు అందలేదని తెలిపారు.

భూమికి బదులు భూమి ఇవ్వాలి

- ఆ తరువాతే రోడ్డు పనులు చేపట్టాలి
- తాడూరులో అధికారులను అడ్డుకున్న రైతులు
- 167 కే జాతీయ రహదారి బైపాస్ కోసం భూసేకరణ


తాడూరు వద్ద అధికారులతో వాగ్వాదం చేస్తున్న రైతులు

తాడూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : తమకు భూమికి బదులు భూమి ఇచ్చాకే ఇక్కడ రోడ్డు పనులు చేపట్టాలని భూములు కోల్పోతున్న రైతులు మంగళవారం అధికారులను అడ్డుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలంలో కల్వకుర్తి-నంద్యాల 167 కే జాతీయ రహదారికి సంబంధించి రోడ్డు నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. బైపాస్ రోడ్డు కోసం రెండు మూడేళ్ల నుంచి భూసేకరణ కొనసాగుతోంది. ఇందుకోసం తాడూరు వద్ద 60 నుంచి 70 ఎకరాల మేర రైతులు భూములు కోల్పోతున్నారు. ఈ భూములు కోల్పోతే తమకు జీవనోపాధి ఉండదని రైతులు కొన్ని నెలలుగా ఆందోళన చేస్తున్నారు. ఈ విషయంపై గతంలోనే తహసీల్దార్‌కు, ఆర్డీవోకు, కలెక్టర్‌కు సైతం వినతి పత్రాలు అందజేశారు. కోర్టుకు కూడా వెళ్లారు. ఇదిలా ఉండగా మంగళవారం రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అధికారులు, పోలీసుల సహాయంతో సర్వే చేసేందుకు వెళ్లారు. రైతులు సర్వే చేయనివ్వలేదు. ప్రస్తుతం పొలాల్లో పంటలున్నాయని, ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి హామీ లభించలేదని, నష్ట పరిహారం మాకు వద్దంటూ భూమికి బదులు భూమి కావాలి అని అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఏదేమైనా ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైతులు తమ పంట పొలాలను జాతీయ రహదారికి ఇచ్చేందుకు ససేమిరా అంటున్నారు.

పుస్తక పఠనంతో జ్ఞానం

- సత్యశోధన పాదయాత్రలో రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న విజయ్‌కుమార్

ఖిల్లాఘణపురం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల పుస్తక పఠనంతో జ్ఞానం పెంపొందుతుందని రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్ తెలిపారు. బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర మంగళవారం వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం మండల కేంద్రంలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా మండల కార్యాలయ సముదాయంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి పాదయాత్ర కొనసాగించారు. జడ్పీహెచ్‌ఎస్ బాలుర, బాలికల, కేజీబీవీ పాఠశాలల్లోని విద్యార్థుల భవిత కోసం మహాత్మా గాంధీ స్వాతంత్ర్య సాధనకు ఆచరించిన నియమాలను వివరించారు. యువకులు విజయ్‌కుమార్‌ను శాలువా పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు. పిల్లల్లో వ్యక్తిత్వాన్ని పెంపొందించడానికి ఉపాధ్యాయులు కృషి అవసరం అన్నారు. విద్యాభివృద్ధి చెందితేనే సమాజాభివృద్ధి సాధ్యమని తెలిపారు.

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



కావేరికి ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి

పెద్దకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్.కావేరి రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఈనెల 17న నిర్వహించిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 విభాగంలో 200 మీటర్స్ పరుగులో బంగారు పతకాన్ని సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యింది. ఖమ్మం జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించనున్న పోటీల్లో పాల్గొననున్నది. ఈ సందర్భంగా మంగళవారం ఆమెకు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి ప్రశంసాపత్రాన్ని అందించారు. పీడీ బాలు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

రేపు ఉమ్మడి జిల్లా రగ్బీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అండర్-14 బాల, బాలికల జట్ల ఎంపికకు ఈ నెల 21న పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి పాపిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011, జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు ఈ పోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగల వారు గురువారం ఉదయం తొమ్మిది గంటలకు స్టేడియానికి చేరుకోవాలని కోరారు.

రేపు సాఫ్ట్‌బాల్ బాలుర జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా ముసాయిపేటలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్ బాల్ కోచ్ సాధిక్‌అలీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2010, జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు పోటీలకు అర్హులని తెలిపారు. అర్హులైన విద్యార్థులు గురువారం ఉదయం మహబూబ్‌నగర్ పట్టణంలోని స్టేడియం మైదానంలో రిపోర్ట్ చేయాలని కోరారు.

క్రీడాకారిణి శ్రావణికి అభినందనలు



శ్రావణికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నాగర్‌కర్నూల్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి అండర్-17 హాకీ పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సీఎస్‌ఆర్ పాఠశాల తొమ్మిదవ తరగతి విద్యార్థిని శ్రావణి ప్రతిభ కనబరిచి అభినందనలు అందుకున్నారు. ఈ నెల 12, 13, 14 తేదీల్లో నిజామాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టు నుంచి ఆమె పాల్గొన్నది. ఈ సందర్భంగా మంగళవారం ఆమెను పాఠశాల ఫౌండర్ భాస్కర్‌రావుతో పాటు ప్రధానోపాధ్యాయిని కవిత, నరసింహమూర్తి, అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఫసియోద్దీన్, వెంకటేశ్వర్‌రావు, పీఈటీలు ఆనంద్, నరేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సరదాగా.. సంతోషంగా..



విహార యాత్రలో పులికల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు (ఫైల్)

- పాఠశాల, కళాశాలల విద్యార్థులకు విజ్ఞాన, విహార యాత్రలు
- పీఎం శ్రీ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం
- 'తెలంగాణ దర్శిని' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం
- రూ. 12.10 కోట్లు మంజూరు
- పర్యాటక ప్రాంతాల సందర్శనకు అవకాశం

అయిజ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విహారయాత్రతో విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు అవకాశం లభించింది. కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం కింద కొన్ని పాఠశాలలను ఎంపిక చేసి, అభివృద్ధికి



విహార యాత్రలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు (ఫైల్)

నిధులు కేటాయిస్తోంది. అందులో భాగంగానే విద్యార్థులను విహారయాత్రలకు కూడా తీసుకెళ్లే అవకాశం కల్పించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా 'తెలంగాణ దర్శిని' పేరుతో విజ్ఞాన, విహారయాత్రలకు అనుమతించింది. పీఎం శ్రీ పథకం కింద ఈ నెల రెండవ శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ మండలంలోని పులికల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషా రాణి విద్యార్థులను విహార యాత్రకు తీసుకెళ్లారు. అలంపూర్ క్షేత్రంలోని ఆలయాలను, అక్కడి కట్టడాలు, శిల్పసంపదను చూడటంతో పాటు, పురావస్తుశాలను సందర్శించారు.

పాఠశాల నుంచి కళాశాల వరకు..

పాఠశాల నుంచి కళాశాల స్థాయి విద్యార్థులకు పర్యాటక, చారిత్రక ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ దర్శిని'కి శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద రెండవ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థుల వరకు వివిధ పర్యాటక ప్రదేశాలను సందర్శించేందుకు ప్రభుత్వం రూ.12.10 కోట్లు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఏకో టూరిజం, కళలు, చేతివృత్తులు, సాంస్కృతిక, చారిత్రక, శాస్త్రీయ ప్రాధాన్యం ఉన్న ప్రదేశాలను సందర్శించేందుకు అవకాశం లభించింది. దసరా పండుగ అనంతరం కొన్ని పాఠశాలల విద్యార్థులను పీఎంశ్రీ పథకం కింద విహార యాత్రలకు తీసుకెళ్లారు. కానీ అప్పటికి సిలబస్ పూర్తి కాదు కాబట్టి ఉపాధ్యాయులు అంతగా ఆసక్తి చూపించలేదు. నవంబర్, డిసెంబర్ నెలల్లో సిలబస్ దాదాపు పూర్తి అవుతుంది. ఆ తర్వాత విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ లోపు విద్యార్థులకు విహార యాత్రలకు తీసుకెళ్లాలని భావిస్తున్నారు. ఎలాగూ సంక్రాంతి సెలవులు ఉంటాయి కాబట్టి అప్పుడు వెళ్తే బాగుంటుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

తరగతుల వారీగా నిధుల కేటాయింపు

విహార యాత్ర కోసం ప్రభుత్వం తరగతుల వారీగా నిధులను కేటాయించింది. అందుకోసం తరగతులను బట్టి విద్యార్థులను నాలుగు విభాగాలుగా చేసింది. మొదటి విభాగంలో రెండు నుంచి నాలుగవ తరగతి వరకు విద్యార్థులు స్థానిక, మండల పరిధిలోని పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలను సందర్శించే అవకాశం ఉంటుంది. అందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.300 చొప్పున కేటాయించింది. రెండవ విభాగంలో ఐదు నుంచి ఎనిమిదవ తరగతి వరకు ఒక రోజు 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రాంతాలను వీక్షించే అవకాశం కల్పించింది. అందుకోసం ఒక్కో విద్యార్థికి రూ.800 కేటాయించింది. మూడవ విభాగంలో తొమ్మిది నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం విద్యార్థుల వరకు రెండు రోజులు, 70 కిలోమీటర్ల పరిధిలో పర్యటించేందుకు అవకాశం ఉంది. అందుకోసం ఒక్కో విద్యార్థికి రెండువేల రూపాయలు కేటాయించింది. నాలుగవ విభాగంలో డిగ్రీ విద్యార్థులు నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించవచ్చు. అందుకోసం ఒక్కో విద్యార్థికి నాలుగు వేల రూపాయలను కేటాయించింది.

విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుంది



విహార యాత్రలతో విద్యార్థులలో విజ్ఞానం పెంపొందుతుంది. కొత్త ప్రదేశాలు చూడటం వల్ల అక్కడి ప్రజల సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం కలుగుతుంది. ఒకటి రెండు రోజుల పాటు ఆహ్లాదంగా గడపడంతో ఆ తర్వాత విద్యార్థులు నూతనోత్సాహంతో చదువుపై దృష్టి సారించే అవకాశం ఉంది.

\- తిమ్మారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జడ్‌పీహెచ్‌ఎస్, మేడికొండ

'తెలంగాణ దర్శిని' విద్యార్థులకు వరం



రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన 'తెలంగాణ దర్శిని' విద్యార్థులకు వరమని చెప్పవచ్చు. అందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో ఈ అవకాశం లేదు. ఇప్పుడు విద్యార్థులు ప్రభుత్వ ఖర్చుతోనే విద్యార్థులు విహారయాత్రకు వెళ్లవచ్చు. దీంతో వివిధ ప్రాంతాల్లోని సంస్కృతి, సంప్రదాయాలు, అద్భుత మైన కట్టడాలు, చారిత్రక విశేషాలను తెలుసుకునే అవకాశం కలుగనుంది.

\- రాములు, ఎంఈవో, ఉండవల్లి

భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం

అలంపూరు, నవంబరు (ఆంధ్రజ్యోతి) 19 : జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ క్షేత్రంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో ఆరుద్రోత్సవం నిర్వహించారు. అంతకు ముందు అర్చకులు గోపూజ, గణపతి పూజ నిర్వహించారు. అనంతరం బాలబ్రహ్మేశ్వర స్వామికి రుద్రాభిషేకం, అన్నాభిషేకం చేశారు. అలాగే జోగుళాంబ ఆలయంలో ప్రత్యేక చేశారు. భక్తులు తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు, ఈవో పురేందర్ కుమార్ పాల్గొన్నారు.



అన్నాభిషేకం అనంతరం బాలబ్రహ్మేశ్వర స్వామి

ఘనంగా లక్ష దీపోత్సవం

మక్తల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాస పూజల్లో భాగంగా నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం ముందు అర్చకులు జ్వాలా తోరణం వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళలు జ్యోతిర్లింగ ఆకృతిలో దీపాలను వెలిగించి పూజలు చేశారు. అలాగే అర్ధనారీశ్వరుడి చిత్రంతో ముగ్గు వేసి చుట్టూ దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్త శ్రీనివాస్‌గుప్తా, కట్ట సురేష్‌కుమార్, కొత్త మీరాబాయ్, మన్నాని వెంకటేష్, విజయ లక్ష్మీ, సరళ తదితరులు పాల్గొన్నారు.



లక్ష దీపోత్సవంలో పాల్గొన్న మహిళలు

న్యూస్ బాక్స్

పార్టీ పూర్వ వైభవానికి కృషి

- టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు



సభ్యత్వం తీసుకున్న నాయకులతో బక్కని నర్సింహులు

మహబూబ్‌నగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పార్టీ పూర్వ వైభవానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బక్కని నర్సింహులు అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలో మంగళవారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు దేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎన్నో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ రెడ్డి, పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బాలప్పతో పాటు పలువురు కార్యకర్తలు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

అనాథ శరణాలయానికి రూ.10 లక్షల విరాళం



కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు లేఖను అందిస్తున్న స్వామీజీ

మాగనూరు, నవంబరు, 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, మాగనూరు మండలం, నేరడగమ్ములోని పక్షిమాద్రి విరక్త మఠంలోని అనాథ శరణాలయానికి కర్ణాటక రాష్ట్రం, ధర్మస్థల్ ఎంపీ వీరేంద్ర హేగ్డే రూ. 10లక్షలు విరాళం అందించారని పీఠాధిపతి పంచమసిద్ధ సింగస్వామి తెలిపారు. దీనికి సంబంధించిన లేఖను మంగళవారం నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నెలలో జరిగే జాతర లోపు అనాథ శరణాలయం, గోశాల, గురు మఠం భవనాలను ప్రారంభం అవుతాయని తెలిపారు. స్వామీజీ వెంట మాజీ సర్పంచు అశోక్ గౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎల్లారెడ్డి ఉన్నారు.

లాయర్స్ అసోసియేషన్ ఉమ్మడి పాలమూరు జిల్లా కమిటీ ఎన్నిక



అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్వర్‌గౌడ్, విల్సన్

పాలమూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా పరమేశ్వర్‌గౌడ్, బీఆర్ విల్సన్‌తో పాటు 25 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. గౌరవ అధ్యక్షులుగా బెక్కెం జనార్దన్, కార్యదర్శిగా ఆర్.ఆర్ మణ్యం, జాయింట్ సెక్రెటరీగా లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షులుగా వెంకట్రావు, సజ్జద్ హమీద్, సభ్యులుగా జగదీష్, ఎన్.వి మహేష్, నరసింహ, రామకృష్ణ గౌడ్, ఉబేద్, సజ్జత్‌అమేద్, వేణుగోపాల్‌గౌడ్, మహమ్మద్ ఇలియాస్ ఎన్నికైనట్లు తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

- జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్
- మహబూబ్‌నగర్‌లోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ తనిఖీ

మహబూబ్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పని చేయాలని జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం ఆయన మహబూబ్‌నగర్ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం, కేసుల నమోదు, వాటి పరిష్కారం, పెండింగ్ కేసులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను తెలుసుకున్నారు. ప్రజలతో సంబంధాలు, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. పని తీరును ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఎస్పీ ఆఫీసులోని సాయుధ దళాల కార్యాలయానికి వెళ్లారు. స్పెషల్ బ్రాంచ్, డీసీఆర్‌బి రికార్డ్‌లు, అడ్మినిస్ట్రేషన్ రికార్డులను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్పీ జానకి, డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్ టౌన్ సీఐ అప్పయ్య ఉన్నారు.



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, చిత్రంలో ఎస్పీ జానకి

రేపు పాసింగ్ అవుట్ పరేడ్

జడ్చర్ల డీటీసీలో శిక్షణ పొందుతున్న 276 మంది సివిల్ కానిస్టేబుళ్ళ శిక్షణ బుధవారంతో ముగియనున్నది. శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ళకు వివిధ జిల్లాల్లో పోస్టింగులు ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీటీసీలో గురువారం పాసింగ్ అవుట్ పరేడ్ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి డైరెక్టర్ ఆఫ్ జనరల్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

రైలులో ప్రయాణిస్తూ గుండె పోటుతో వ్యక్తి మృతి



మైలారి (ఫైల్)

కృష్ణ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రైలులో ప్రయాణిస్తూ ఓ వ్యక్తి గుండె పోటుతో మృతి చెందాడు. నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలోని తంగడిగి గ్రామానికి చెందిన మైలారి (40) ముంబైలో ఫార్మసీ డిస్ట్రిబ్యూటర్‌గా పని చేస్తున్నారు. రెండు రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన సోమవారం సాయంత్రం కృష్ణ రైల్వే స్టేషన్‌లో మెయిల్ ఎక్స్‌ప్రెస్‌లో ముంబైకి బయలు దేరాడు. రాత్రి 10 గంటల సమయంలో రైలు మహారాష్ట్రలోని అక్కల్‌కోట్‌కు చేరుకున్నది. అదే సమయంలో ఆయన గుండెపోటుతో మృతి చెందాడు. తోటి ప్రయాణికులు గమనించి రైల్వే పోలీసులకు తెలిపారు. వారు కుటుంబసభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఈ మేరకు మృతుడి భార్య అంజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మైలారికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

మరికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేశ్ మరికల్ మండలం మాధవరం గ్రామ శివారులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఏఎస్ఐ ఎల్లయ్య తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వెంకటేశ్ సోమవారం రాత్రి మరికల్‌లో మద్యం తాగి, అత్తగారి ఊరైన మాధవరం గ్రామానికి కాలినడకన బయలుదేరాడు. గ్రామ శివారులోని కల్వర్టు పక్కన పడి మృతి చెందాడు. ఈ మేరకు అతడి తల్లి సౌభాగ్యలక్ష్మి ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది.

పార్క్ చేసిన స్కూటీలో పాము



స్కూటీ డూమ్‌లో ఉన్న పాము

గద్వాల క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పార్కు చేసి ఉన్న ఓ స్కూటీలోకి పాము దూరింది. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. పట్టణానికి చెందిన రషీద్ అనే వ్యక్తి రెండవ రైల్వే గేట్ సమీపంలోని బీరెల్లి చౌరస్తాలో తన స్కూటీని పార్క్ చేశాడు. అరగంట తర్వాత వచ్చి చూసే సరికి స్కూటీ ముందుండే డూమ్‌లో నుంచి పాము బయటకు వస్తూ కనిపించింది. దీంతో రషీద్‌తో పాటు అక్కడున్న వారందరూ భయాందోళనలకు గుర య్యారు. వెంటనే అప్రమత్తమై పామును చంపేశారు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది.

పరిహారం.. పరిహాసం

- నాలుగు నెలల క్రితమే ఇచ్చినట్లు రైతులతో సంతకాలు
- ఇప్పటికీ చెక్కులు అందక ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేసున్న రైతులు

గద్వాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పంట పొలాలు నీట మునిగి, భూమిని కోల్పోయిన తమకు గత ఏడాదిగా పరిహారం ఇవ్వకుండా అధికారులు పరిహాసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిహారం చెక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బాధిత రైతులు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం ఆందోళన నిర్వహించారు.

జల విద్యుత్ కేంద్రం నిర్మాణంతో..

గద్వాల మండలం రేకులపల్లి గ్రామం వద్ద లోయర్ జూరాల జల విద్యుత్ కేంద్రాన్ని నిర్మించింది. దీంతో నదీ ప్రవాహం వెనక్కి వెళ్లి పంటపొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో 299 మీటర్ల వద్ద భూసేకరణ చేసి అప్పట్లో పరిహారం చెల్లించారు. కానీ నదీ ప్రవాహం మూడు లక్షల క్యూసెక్కుల కంటే ఎక్కువైతే రెండు వైపులా వందల ఎకరాల్లో భూములు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ప్రతీ సంవత్సరం సాగు చేసిన పంటలు నీటిలో మునిగి రైతులు నష్టపోతున్నారు. దీంతో రైతులు పోరాటాలు చేయడంతో, అప్పట్లో ఎకరాకు రూ.12 వేల చొప్పున 2015 నుంచి 2018 వరకు పంట పరిహారం ఇచ్చారు. అయితే సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని రైతులు కోరడంతో భూ సేకరణ చేశారు.

ముంపునకు గురవుతున్న 67 ఎకరాలు

ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు రెండేళ్ల క్రితం 301 మీటర్ల ఎత్తు వరకు నీటి ప్రవాహాన్ని పరిశీలించి, ఎంత మేరకు పొలాలు నీట మునుగుతాయో గుర్తించారు. సర్వే నెంబర్ 226 నుంచి 270 వరకు దాదాపు 67.30 ఎకరాల్లో భూమి ముంపునకు గురవుతుందని ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో దాదాపు 120 మంది రైతులకు సంబంధించిన భూములున్నాయి. వీటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ వేసి, దాదాపు ఆరుకోట్ల రూపాయలు పరిహారం చెల్లించాల్సి వస్తుందని జెన్‌కో అధికారులకు నివేదించారు. దీంతో జెన్‌కో అధికారులు ఏడాది క్రితం మొదటి విడుతగా రూ.4.32 కోట్లు ఆర్డీవో ఖాతాలో డిపాజిట్ చేశారు.

ఏడాది గడిచినా అందని పరిహారం

జెన్‌కో అధికారులు ఆర్డీవో ఖాతాలో పరిహారం డబ్బును డిపాజిట్ చేసి ఏడాది గడిచిపోతున్నది. కానీ తమకు ఇప్పటివరకు చెక్కులు ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగగా, పరిహారం ఇస్తున్నట్లు నాలుగు నెలల క్రితం తమతో సంతకాలు చేయించుకున్నారని, చెక్కులు అడిగితే ఆఫీసుకు వచ్చి తీసుకోవాలని చెప్పారని తెలిపారు. అప్పటి నుంచి తాము తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చెక్కుల పంపిణీని లాంచనంగా ప్రారంభించినప్పటికీ, తమకు మాత్రం ఇంత వరకు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

హోమియోపతి మందులు వాడొచ్చు

● వైద్యాధికారిణి సాయిసింధూజ



ధన్వాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లిషు మందులతో పాటు ప్రభుత్వం ఉచితంగా హోమియోపతి, ఆయుర్వేద మందులను సైతం రోగులకు అందిస్తోంది. అయితే చాలామంది రోగులు అవగాహనా లోపంతో హోమియోపతి దవాఖానకు చూపించుకోవడానికి రావడం లేదని వైద్యాధికారిణి సాయిసింధూజ పేర్కొన్నారు. హోమియోపతి మందుల వాడకంపై ఆమె మంగళవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

హోమియోపతి మందుల వాడకంలో అవగాహన కల్పిస్తున్నారా?

అన్ని రోగాలు నయం చేయడానికి హోమియోపతి మందులు ఉన్నాయి. కానీ ఎవరూ ఈ మందులపై ఆసక్తి చూపించడం లేదు. ప్రస్తుతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చేవారికి తెలుపుతున్నాం.

ఏఏ రోగాలకు మందులున్నాయి?

ఈ రోగం అంటు ఏం లేదు. ఈ మందులు వాడటం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావు. హోమియోపతి మందులు అన్ని రోగాలకు బాగా పనిచేస్తాయి.

ధన్వాడలో ఉన్నట్టుగా జనాలకు తెలుసా?

ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎన్నో ఏళ్ల నుంచి హోమియోపతి దవాఖాన ఉంది. ప్రస్తుతం అన్ని రోగాలకు సంబంధించి ఇటీవలే కొత్త మెడిసిన్స్ వచ్చాయి. ప్రస్తుతం ఇప్పటికి రెగ్యులర్‌గా 20 నుంచి 30 మంది దాకా రోగులు వస్తున్నారు.

హోమియోపతి మందుల వాడకంపై మీ సలహా?

ఏ రోగం ఉన్నా హోమియోపతి దవాఖానకు రావచ్చు. ఆలస్యంగానైనా మందులు మంచిగా పనిచేస్తాయి.

న్యూస్ బాక్స్

పారిశుధ్య పనుల పరిశీలన

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మునిసిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారుల్లో మంగళవారం వేకువజామున మునిసిపల్ కమిషనర్ సునీత పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులుకు పారిశుధ్య పనులపై ఆమె పలు సూచనలు చేశారు.

ముగ్గుల పోటీలు

నారాయణపేట/కోస్గి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో వందమంది పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. లైబ్రేరియన్ శిల్ప, సిబ్బంది రఘు, ఉపాధ్యాయులు ఉన్నారు.

అదేవిధంగా, కోస్గి గ్రంథాలయంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళ అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, విద్యార్థులతో 'సమాజంలో మహిళల పాత్ర'పై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. పాఠశాలల విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో శ్రీధర్, విశ్రాంత ఉపాధ్యాయుడు రఘునాథ్‌రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది నర్సిములు తదితరులున్నారు.

24న భగవద్గీత శ్లోక పోటీలు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గీతా జయంతిని పురస్కరించుకొని ఈనెల 24న ఆదివారం సింగార్‌బేస్ సర్వస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 గంటలకు భగవద్గీత కంఠస్థ శ్లోక పోటీలు నిర్వహించనున్నామని వీహెచ్‌పీ నాయకులు నర్సిములు, కన్న శివకుమార్, ప్రవీణ్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పాల్గొనాలని వారు కోరారు.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం వరి విక్రయానికి వచ్చింది. వడ్లు సోనరకం 3,979.20 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ.2,579, కనిష్ఠ ధర రూ.1,771 రమారమిగా రూ.2,409 పలికింది. వడ్లు హంస రకం 294 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ.3,411, కనిష్ఠ ధర రూ.1,955, రమారమి ధర రూ.3,406 పలికింది. ఎర్ర కందులు 9.31 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ.10,009, కనిష్ఠ ధర రూ.9,225 రమారమి ధర రూ.10,009 పలికింది.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

మద్దూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మద్దూర్ భీములును పట్టణానికి చెందిన తోటి మిత్రులు మంగళవారం ఘనంగా సన్మానించారు. రాబోయే రోజుల్లో ఉన్నత పదవుల్లోకి రావాలని వారు ఆకాంక్షించారు. అబ్దుల్ ఖయ్యుం, రాఘవేందర్, బుగ్గప్ప, విఠల్, బుగ్గప్ప తదితరులు సన్మానించిన వారిలో ఉన్నారు.

తూము మరమ్మతు చేయాలి

ధన్వాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ పెద్ద చెరువు తూమును మరమ్మతు చేయాలని బీఆర్‌ఎస్ రైతు విభాగం నాయకుడు ముసిరిగారి నర్సిములు అన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, వెంటనే మరమ్మతులు చేయకుంటే రైతులతో ఇరిగేషన్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పొంచి ఉన్న ప్రమాదం

» రహదారి మధ్యలో ట్రాన్స్‌ఫార్మర్
» కంచె లేకుండా ఏర్పాటు
» అధికారుల నిర్లక్ష్యం, పట్టింపులేని తనానికి నిదర్శనం

మక్తల్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అధికారుల నిర్లక్ష్యం.. పట్టింపులేని తనంతో ఏకంగా ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను రహదారి మధ్యలోనే ఏర్పాటు చేశారు. దీంతో పరిసరాల ఇళ్లల్లో నివాసం ఉంటున్న ప్రజలు ఇబ్బందుల పాలవుతున్నారు. మక్తల్ మండలంలోని కర్ని గ్రామంలోని ధనలక్ష్మి కాలనీలో నివాసగృహాలకు అత్యంత సమీపంలో దాదాపు రోడ్డు మధ్యలో కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. కాలనీ నుంచి రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కనీసం కంచె కూడా ఏర్పాటుచేయకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోననే భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటుచేసిన హైటెన్షన్ వైర్లు సైతం ఇంటి మీదుగా తీసుకెళ్లారు. చిన్నారులు ఇంటిపైకి వెళ్లినా, రోడ్డుమీదికి వెళ్లినా ఎటువైపు నుంచి ఎలాంటి ఆపద ముంచుకొస్తుందోనని భయాందోళనతో కాలం వెళ్లదీస్తున్నారు. గతంలో ఇదే ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మూగజీవాలు మృత్యువాత పడిన సంఘటన తలుచుకొని కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. విషయాన్ని విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా గ్రామస్థులు స్థలాన్ని చూపిస్తే ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తామని తెలిపారు.

రోజూ ఇబ్బందులు పడుతున్నాం..



రహదారి మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చిన్నారులను రోడ్లపైకి పంపకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి చుట్టూ ఫినిషింగ్ చేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలి.

- నజీముద్దీన్, కర్ని



కర్నిలో ప్రమాదకరంగా రోడ్డు మధ్యలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెన్షన్ పెంపు కోసం నేటి నుంచి ఉద్యమం

» డిసెంబరు 9న చలో హైదరాబాద్
» దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్



మాట్లాడుతున్న వెంకట్

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పెన్షన్ రూ.ఆరు వేలు పెంచాలని డిమాండ్ చేస్తూ బుధవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాలు చేపట్టనున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్ అన్నారు. మంగళవారం నారాయణపేట అంబేడ్కర్ భవనంలో జిల్లా కమిటీ అధ్యక్షురాలు రాధమ్మ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన వెంకట్ మాట్లాడారు. అధికారంలోకి వస్తే దివ్యాంగులకు రూ.ఆరు వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.నాలుగు వేలు పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 11 నెలలవుతున్నా పెన్షన్ పెంచకుండా కాలయాపన చేస్తోందన్నారు. కొత్త పెన్షన్ల కోసం 24.85 లక్షల మంది ఎదురుచూస్తున్నారని అన్నారు. ఉద్యోగ నియామకాల్లో శారీరక దివ్యాంగులకు రోస్టర్ పది లోపు తగ్గించాలన్నారు. రూ.25 వేలు ప్రత్యేక అలవెన్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. ఈ నెల 20 నుంచి 25 వరకు గ్రామాల్లో ప్రచారం చేస్తామని, 25న కలెక్టరేట్ ముట్టడి, 28, 29 తేదీల్లో ఎమ్మెల్యేలకు వినతులు ఇవ్వడం, 30న ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరాహార దీక్షలు చేపడతామన్నారు. డిసెంబర్ 9న చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తున్నామన్నారు. సమావేశంలో దశరథ్, బాబు, రంగయ్య, మల్లేష్, నర్సప్ప, బస్వరాజ్, వెంటయ్య, హన్మంతు, రాములు తదితరులున్నారు.

ఘనంగా ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

నారాయణపేటరూరల్/ధన్వాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పేట మండల పరిధిలోని బోయిన్‌పల్లి యూపీఎస్, జాజాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి స్త్రీ శక్తి దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. జాజాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో హెచ్‌ఎం భారతి మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ, మధు, భానుప్రకాశ్, లక్ష్మణ్, నిర్మల, మంగళ, శిరీష, శ్రీదేవి, నరసింహా, ప్రతాప్, రఘు పాల్గొన్నారు. బోయిన్‌పల్లిలో ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, శ్రీలత తదితరులున్నారు.



జాజాపూర్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



దన్వాడలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యువకులు

అదేవిధంగా, ధన్వాడలో మంగళవారం హిందువాహిని, ఆర్‌ఎస్‌ఎస్, ఏబీవీపీ ఆధ్వర్యంలో ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హిందువాహిని జిల్లా అధ్యక్షుడు జుట్ల సుదర్శన్‌గౌడ్, మాదరం రవికుమార్‌గౌడ్, ఎం.సత్యనారాయణ, చాకలి బాల్‌రాజు, రాఘవేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

- కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి



మక్తల్‌లో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



మరికల్‌లో ఇందిరాగాంధీ విగ్రహం ముందు నివాళ్లు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మక్తల్/మరికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఆమె 107వ జయంతిని పురస్కరించుకొని మక్తల్ పట్టణంలోని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఇంటి వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడారు. ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు కొనియాడారు. జాతీయాకరణ, అణుశక్తి, పాకిస్తాన్ సమస్య వంటివాటిని ధృడంగా ఎదుర్కొన్న ధీర మహిళ అని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్‌కుమార్, రవికుమార్, కట్ట సురేష్‌కుమార్, గోలపల్లి నారాయణ, వాకిటి శ్యామ్, కల్లూరి గోవర్దన్ నారాయణ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా, మరికల్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరన్న, పట్టణ అధ్యక్షుడు హరీశ్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. హరిత విప్లవం, పేదరికం నిర్మూలన కోసం ఇందిరాగాంధీ కృషి చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, రామకృష్ణారెడ్డి, అంజిరెడ్డి, ఎల్.రాములు, రాఘవేందర్ తదితరులున్నారు.

తిమ్మప్పను దర్శించుకున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు



ఆలయ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి

నారాయణపేట రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయాన్ని మంగళవారం డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణం, అక్కడి సమస్యలను ఆయన గ్రామస్థులు, ఆలయ కమిటీ సభ్యులనడిగి తెలుసుకున్నారు. గతంలో చేసిన పనుల లోటుపాట్లను చూసి ఇక ముందు చేసే పనులకు ఎలా చేస్తే బాగుంటుందో సభ్యులతో చర్చించారు. త్వరలోనే ఆలయ నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఎండోమెంట్ ద్వారా ఎమ్మెల్యే పర్ణికారెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయిస్తామన్నారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, గందె చంద్రకాంత్, బండి వేణుగోపాల్, ఊశప్ప, భాస్కర్‌రెడ్డి, అశోక్, ఆనంద్ తదితరులున్నారు.

ఆర్టీసీ డిపో ముందు సీఐటీయూ నిరసన

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పి కార్మికుల హక్కులు కాపాడాలని మంగళవారం నారాయణపేట ఆర్టీసీ డిపో ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడారు. ప్రజాపాలన అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీలో తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో కేసీఆర్ పరిపాలనలో కార్మికుల హక్కులను కాలరాశారని విమర్శించారు. నిరసనలో బలరాం, నాగప్ప తదితరులున్నారు.

పంటల అధిక దిగుబడిపై అవగాహన

కోస్గిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వివిధ రకాల పంటల అధిక దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. మంగళవారం గుండుమల్ గ్రామంలోని రైతువేదికలో రైతులకు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాస్త్రవేత్తలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సింగిల్ సూపర్‌ఫాస్పేట్ వినియోగం, రొటోవేటర్ ఉపయోగం, డీకంపోజింగ్ విధానం, మట్టి నాణ్యత పెంపు తదితర అంశాలపై పరిసర ప్రాంత రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో రేష్మారెడ్డి, ఏఈఓ హర్షవర్ధన్, నరేందర్, రైతులు పాల్గొన్నారు.

రేపు ప్రజాపాలన విజయోత్సవ సంబురాలు

దామరగిద్ద, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా ప్రజాపాలనపై విజయోత్సవ సంబురాలు కళాకారులతో ఘనంగా నిర్వహించనున్నామని ఎంపీడీవో సాయిలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 21న ఉదయం తొమ్మిది గంటలకు గడిమున్కన్‌పల్లిలో, 11 గంటలకు దామరగిద్దలో, మధ్యాహ్నం ఒంటి గంటకు కానుకుర్తిలో కళాకారులతో పాటలు, నృత్యాలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామని వివరించారు. ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఊట్కూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అమీన్‌పూర్ గ్రామానికి చెందిన దొబ్బలి నాగేష్ తన ట్రాక్టర్‌లో అమీన్‌పూర్ వాగు నుంచి పగిడిమారికి ఇసుకను తరలిస్తుండగా మార్గమధ్యలో పోలీసులు ఆపి అనుమతి పత్రాలు అడిగారు. ఎలాంటి అనుమతులు లేకపోవడంతో వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గుట్కా ప్యాకెట్లు పట్టివేత

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలోని ఓ కిరాణ దుకాణంలో మంగళవారం రూ.13,700 విలువ చేసే ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. యజమాని యూసూఫ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్



మల్టీపర్పస్ వర్కర్లను సన్మానించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటికి మరుగుదొడ్డి నిర్మించుకోవాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. అంతర్జాతీయ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం కలెక్టరేట్ వీసీ హాల్‌లో డీడబ్ల్యూఎస్‌ఎం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మల్టీపర్పస్ వర్కర్లు గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రతీ ఒక్కరూ మరుగుదొడ్డి నిర్మించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం మల్టీపర్పస్ వర్కర్లు భారతమ్మ, మణెమ్మ, సిద్ధిరాములు, కన్యప్పలను కలెక్టర్ సన్మానించారు. ట్రైనీ కలెక్టర్ గరీమానరుల, డీఆర్‌డీవో మొగులప్ప, డీపీవో కృష్ణ తదితరులున్నారు.

ప్రజాపాలన కళాయాత్ర ప్రారంభం

డిసెంబర్ ఏడవ తేదీ వరకు కొనసాగునున్న కళాయాత్ర ఉత్సవాల ప్రచార రథాన్ని కలెక్టర్ సిక్తాపట్నాయక్ మంగళవారం కలెక్టరేట్ వద్ద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లాలోని మునిసిపాలిటీలు, మండలాల్లో కళాజాత యాత్ర బృందం ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని బలోపేతం చేయాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ సౌభాగ్యలక్ష్మి

నారాయణపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని బలోపేతం చేద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ సౌభాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం నారాయణపేట డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లా వైద్యాధికారులకు, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ శిబిరాన్ని ఉద్దేశించి డీఎంహెచ్‌వో మాట్లాడారు. పోలియో వ్యాధి, మీజిల్స్ రూబెల్లా వ్యాధుల నిర్మూలనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అజహర్, సాయిరాం, రాఘవేందర్‌రెడ్డి, భిక్షపతి, గోవిందరాజు, శ్రీనివాసులు, స్నేహలత తదితరులున్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి : సీఐ



జలాల్‌పూర్ చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తున్న సీఐ శివశంకర్

నారాయణపేటరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక నుంచి ధాన్యం తెలంగాణకు రాకుండా చెక్‌పోస్టుల వద్ద రెవెన్యూ, పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని పేట సీఐ శివశంకర్ అన్నారు. మంగళవారం ఆయన పేట మండలంలోని జలాల్‌పూర్ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ చెక్‌పోస్టు వద్ద ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాహన నంబర్లను రికార్డులో నమోదు చేయాలన్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

తప్పులు లేకుండా సర్వే నిర్వహించాలి : ఎంపీడీవో

మాగనూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తప్పులు లేకుండా కుటుంబ సర్వే చేయాలని ఎంపీడీవో రహమతుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని నేరగడమ్ము, వర్కూరు గ్రామాలతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే పనులను పరిశీలించారు. ప్రతీ ఎన్యుమరేటర్ 10 నుంచి 15 ఇళ్లను తప్పకుండా సర్వే చేయాలన్నారు. ఇప్పటికి 60 శాతం కులగణన సర్వే చేసినట్లు వారు తెలిపారు. ఎంపీడీవో వెంట పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి, సర్వే అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి : ఏఎంవో

ధన్వాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రమశిక్షణ అంతే ముఖ్యమని ఏఎంవో విద్యాసాగర్ అన్నారు. ధన్వాడ మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి పలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. గుణాత్మకమైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. ఏఎంవో వెంట విద్యా ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, సీఆర్పీ ఎం.నారాయణ ఉన్నారు.

విద్యార్థులు ఆటల్లో రాణించాలి : మాజీ ఎమ్మెల్యే చిట్టెం

మక్తల్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో రాణించాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కర్ని గ్రామంలో నిర్వహిస్తున్న జాతీయ ఖోఖో అండర్-18 క్రీడల శిక్షణ శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములు సమానంగా తీసుకుని చదువుతో పాటు ఆటల్లో రాణించాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేను విశ్రాంతి పీఈటీ పి.గోపాలం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి.నరసింహగౌడ్, ఖోఖో కోచ్ దీప, వసంతగౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.

21న మత్స్యకార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

- ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నారాయణపేట న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21న జరిగే మత్స్యకార్మిక దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సిటిజన్ క్లబ్‌లో మత్స్యకార్మిక దినోత్సవ వాల్‌పోస్టర్‌ను సంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచి ముదిరాజ్‌ల జనాభాకు అనుగుణంగా తమ వాటా కేటాయించాలన్నారు. అదేవిధంగా, తెలంగాణ మత్స్య కోఆపరేటివ్ ఫెడరేషన్‌కు వెంటనే ఎన్నికలు జరిపించాలన్నారు. కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్‌కుమార్, మిర్చివెంకటయ్య, గురులింగం, కాకర్ల భీమయ్య, మారుతి, కోనంగేరి జనార్దన్, రాజేష్, పండు తదితరులున్నారు.

వ్యవసాయ కూలీలకు జీవనభృతి ఇవ్వాలి

ఊట్కూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు జీవన భృతి ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు కనకరాయుడు డిమాండ్ చేశారు. ఈనెల 25న మండల కేంద్రాల్లో జరిగే ధర్నాకు తరలిరావాలని కోరుతూ మంగళవారం మండలంలోని చిన్నపొర్ల గ్రామంలో కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. నాయకులు కుర్వ లింగప్ప, అంజప్ప తదితరులున్నారు.

మండల వాసికి డాక్టరేట్ పట్టా



డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న రాములు

మద్దూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలవాసి రాములు డాక్టరేట్ పట్టా సాధించాడు. మండలంలోని చెన్వార్ గ్రామానికి చెందిన మినిగేరి రాములు ప్రొఫెసర్ పాండురంగారెడ్డి పర్యవేక్షణలో హైడ్రోజియెలాజికల్, మెర్ఫోలాజికల్, జియో ఫిజికల్ ఆన్‌కాకరవాణి రివర్ బేసిన్ అంశాలకు సంబంధించిన ప్రయోగాలపై డాక్టరేట్ పట్టాను పొందినట్లు రాములు వెల్లడించారు. సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

డబ్బులు అడిగిన వ్యక్తిపై దాడి, కేసు నమోదు

ఊట్కూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తాను ఇచ్చిన అప్పును అడగడానికి వెళ్లిన వ్యక్తిపై దాడి చేసిన సంఘటన మంగళవారం మండల కేంద్రంలోని పాతపేట వీధిలో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఊట్కూర్ పాతపేటకు చెందిన బెస్త బుడ్డప్ప అదే ప్రాంతానికి చెందిన కావలి మహేష్‌కు చేబదులుగా డబ్బులు ఇచ్చాడు. చాలారోజులు కావడంతో డబ్బులు ఇవ్వాలని బుడ్డప్ప మహేష్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరి మధ్యా మాటమాట పెరిగి మహేష్, అతని సోదరుడు అనిల్‌లు బుడ్డప్పపై కట్టెలతో దాడి చేశారు. తలకు తీవ్ర గాయాలు కావడంతో బుడ్డప్ప ఆసుపత్రిలో చికిత్స చేయించుకొని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మహేష్, అనిల్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.